క్లుప్తంగా

నేడు గురుపౌర్ణమి


దత్త సాయి దేవాలయంలో కొలువుదీరిన సాయిబాబా

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని శ్రీదత్త సాయి దేవాలయంతో పాటు పలు ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. దత్తసాయి బాబాకు ఉదయం కాకడ హారతితో పూజ కార్యక్రమాలు ప్రారంభమై ద్వాదశ జ్యోతిర్లింగాలకు పంచామృతాభిషేకం, సహస్ర నామావళి ఊది అర్చన తదితర పూజలు నిర్వహించనున్నారు. అదేవిధంగా మధ్యాహ్న హారతి, అన్నదానం, సాయంత్రం పల్లకీ సేవ నిర్వహిస్తామని దత్త సాయి సేవా సమితి సభ్యులు తెలిపారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు


గంజిళ్ల రోడ్డులో పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని గంజిళ్ల రోడ్డులోని ప్రధాన మురిగు కాలువాలో పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. అనంతరం శ్రీనివాస సర్కిల్‌లో ప్రారంభించనున్న అన్న క్యాంటిన్ పనులను పరిశీలించిన కమిషనర్ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ నీరజ, ఏఈ మదన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై సమాచారం ఇవ్వాలి


మాట్లాడుతున్న రాఘవేంద్రరావు

ఎమ్మిగనూరుటౌన్: వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్లు, రాగి తీగ, ఆయిల్ దొంగతనాలు ఇటీవల ఎమ్మిగనూరు సబ్‌డివిజన్ పరిధిలో పెరిగిపోతున్నందున, అలాంటి సంఘటనలు జరిగిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని విద్యుత్ శాఖ డీఈఈ రాఘవేంద్రరావు సూచించారు. శనివారం సబ్‌డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీల కట్టడిపై రైతుల్లో అవగాహన పెంచేందుకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్లు, అందులోని రాగితీగ, ఆయిల్ అపహరణ జరిగితే రైతులు వెంటనే తమ శాఖ సిబ్బంది, లేదా పోలీసులకు ఫిర్యాదులు చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ గురుమూర్తి, లైన్ ఇన్‌స్పెక్టర్ రాయచోటి స్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన

కోసిగి: పాఠశాలల పరిధిలో ఉండే ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి ఫిజియోథెరపీ చేయించాలని ఎంఈఓ మొయినుద్దీన్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఫిజియోథెరపిస్టులు మహేష్‌కుమార్, రమేష్ ఆధ్వర్యంలో హెచ్‌ఎంలకు అవగాహన కల్పించారు. పాఠశాలలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ చేయించేలా శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించే చూడాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఎంఈఓ-2 నాగేశప్ప, హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు సందడిగా మారాయి. మండల కేంద్రంతో పాటు మండలంలోని అగసలదిన్నె, బుడుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆం.నేయస్వామి దేవాలయాల్లో స్వామికి తెల్లవారుజామున అర్చకులు సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలతో పాటు నిత్యపూజలు చేపట్టారు.

లాడ్జీ తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న టూటౌన్ సీఐ గోపీ

ఆదోని అర్బన్: టూటౌన్ సీఐ గోపీ శనివారం రాత్రి పట్టణంలోని భీమాస్ లాడ్జీలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లాడ్జీలోని రూములను పరిశీలించి అనంతరం రికార్డులను తనిఖీ చేసి, ఎవరెవరు వచ్చారు, ఎవరెవరు వచ్చి వెళ్లారు తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఉరుకుందలో వేలాలు


షీల్డ్ టెండర్లను ఓపెన్ చేస్తున్న డీసీ

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద ఏడాది పాటు టెంకాయలను సరఫరా చేయడానికి, అరచిప్పను ప్రోగు చేసుకొనే హక్కు కోసం శనివారం జరిగిన వేలం పాటల్లో ఉరుకుందకు చెందిన ముత్తన్న రూ.64,00,062కు సొంతం చేసుకున్నారని డిప్యూటీ కమిషనర్ హెచ్.జి.వెంకటేశ్ తెలిపారు. అలాగే దేవాలయానికి పేపర్ రోల్స్ సప్లయ్ కోసం వైభవ్ బుక్ సెంటర్ వారు తక్కువకు కోట్ చేశారు. ఆలయానికి ఎలక్ట్రికల్ వస్తువులు, ప్లంబింగ్ పనులకు, సప్లయర్స్ సామగ్రి సరఫరాకు, శ్రావణ మాసంలో ట్రాక్టర్ ట్యాంకర్లతో నీటి సరఫరా కోసం వేలం వేసి పనులు అప్పగించినట్లు చెప్పారు. అదే మాసంలో మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటులో పాటదారుల ఇద్దరి డాక్యుమెంట్లు సరిగా లేక పరిశీలనకు పంపినట్లు డీసీ తెలిపారు. సులభ్ కాంప్లెక్స్ నిర్వహణ, పూజ సామగ్రి సరఫరా, పాదరక్షల భద్రపరుచుట, శానిటేషన్ మెటీరియల్స్, ఇంకా వివిధ వాటికి టెండర్లు పిలవగా ఎవరూ టెండర్ దాఖలు చేయలేదని, దీంతో వాటి వేలాలను వాయిదా వేసినట్లు చెప్పారు. కోసిగి సీఐ ప్రసాద్, మంత్రాలయం సీఐ ఎరిశావలి, కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి పోలీసు బందబస్తు ఏర్పాటు చేశారు. ఆదోని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఆలయ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనదారులకు సూచనలిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని అర్బన్: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని డీఎస్పీ శివనారాయణస్వామి హెచ్చరించారు. శనివారం పట్టణ పరిసరాల్లో ప్రమాదాలు నివారించడానికి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రాంగ్ పార్కింగ్, రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు లేని 38 వాహనాలకు రూ.10,930 జరిమానా విధించి, 9 వాహనాలను మోటార్ వెహికల్ అధికారులకు అప్పగించినట్లు డీఎస్పీ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ చేపట్టి ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. తాగి నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతాయన్నారు. ట్రాఫిక్ సీఐ బి.ఎ.మంజునాథ్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహనదారులకు నిబంధనలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రధాన రోడ్లపై తోపుడుబండ్ల వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా వ్యాపారాలు నిర్వహించాలని సూచించారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి


తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పెద్దకడబూరు : ఖరీఫ్ పంటల సాగుకు రైతులకు పెట్టుబడి సాయం అందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, సీనియర్ నాయకులు పరమేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు పెట్టుబడి సాయంగా రూ. 20వేలు ఇస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. అధికారంలోకి వచ్చి నెలన్నర గడిచినా ఆ అంశం గురించి ప్రస్తావించకపోవడం సరికాదన్నారు. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్న ప్రభుత్వం నుంచి కనీసం సాయం అందకపోవడం దారుణమన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకులలో రుణ సౌకర్యం కల్పించాలన్నారు. వ్యవసాయ బోర్లు, మోటార్లుకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయరాదన్నారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ మహేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉప్పర ఈరన్న, రాజు, శేఖర్, వీరేష్, రామాంజినేయులు, బాబు పాల్గొన్నారు.

యువతకు కరువైన ఉపాధి అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కరువయ్యాయని, దీంతో యువకుల శక్తి,సామర్థ్యాలు వృథా అవుతున్నాయని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని భగత్‌సింగ్ భవనంలో డీవైఎఫ్ఐ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మహేష్, సురేష్, ఉపాధ్యక్షులుగా శేఖర్, మోహిన్,రమేష్, సహాయ కార్యదర్శులుగా వీరేష్, గురు, రవిని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతోనే యువత చెడుమార్గాల్లో పయనిస్తున్నారని, మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని ఆరోపించారు. జిల్లాలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బాలికల హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ప్రభుత్వ బీసీ ప్రీమెట్రిక్ బాలికల హాస్టల్‌కు సొంత భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్టల్ అద్దెభవనంలో నిర్వహిస్తున్నందున విద్యార్థినులు అసౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. 450మంది విద్యార్థినులకు గదులు సరిపోక అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పట్టణంలోని ఎస్సీ,బీసీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. సమావేశంలో నాయకులు విజయ్, అగ్గిరాముడు,అభి,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో వ్యవసాయ రంగం

- ఏపీ రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్నాథం

ఎమ్మిగనూరుటౌన్: అతివృష్టి, అనావృష్టితో రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో మునిగిపోతుందని ఏపీ రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.జగన్నాథం ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో రైతు గౌరవంగా జీవించే పరిస్థితులు లేవన్నారు. పాలకుల తప్పుడు విధానాల కారణంగా రైతులు, కౌలు రైతులు, గ్రామీణ చేతి వృత్తిదారుల స్థితిగతులు రోజురోజుకు దిగజారి పోతున్నాయన్నారు. గతేడాది కరువు జిల్లాలను ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని, పంట నష్ట పరిహారం అందలేదన్నారు. జిల్లాలో వేదావతి, ఆర్‌డీఎస్ కుడికాలువా, గుండ్రేవుల ప్రాజెక్టులు నిర్మించి పశ్చిమ ప్రాంత రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. జిల్లాలో నకిలీ విత్తనాల బెడద పెరిగిపోతుందని, అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈనెల 29, 30, 31తేదీల్లో మదనపల్లెలో నిర్వహించే రైతు సంఘ రాష్ట్ర స్థాయి సమ్మేళనానికి రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు మాలిక్, బిటి.చిన్నన్న, శాంతప్ప, విరుపాక్షినాయుడు, గిడ్డయ్య, నాగప్ప, ఇస్మాయిల్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయండి

నందవరం : వానలు కురుస్తుడడంతో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ రేవతి, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య పేర్కొన్నారు. మండల కేంద్రం నందవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఇంజినీరింగ్ అధికారులకుతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మలేరియా, డెంగీ, డయేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఆర్ఐ జెర్మియా, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెండి వడ్డాణం చోరీ

ఆస్పరి: మండల కేంద్రం సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీమాత ఆలయంలో అమ్మవారి వెండి వడ్డాణం చోరీకి గురైందని ఆలయ నిర్వాహకులు రూపామోహన్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ హనుమంతప్పకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 16న అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం గర్భగుడికి తాళం వేసి, తాళాలను గుడిలోనే ఉంచి వెళ్లాం. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రూ.70వేల విలువజేసే వెండి వడ్డాణం ఎత్తుకెళ్లారని చెప్పారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

నదితీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కౌతాళం: తుంగభద్ర నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ తుంగభద్ర నదికి వరద ఉధృతి పెరగడంతో ఏ సమయంలోనైనా నదికి నీరు వదిలే అవకాశముందని ఉన్నత అధికారులు తెలిపారన్నారు. ముందు జాగ్రత్తగా తీర గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర నదికి ప్రవాహం పోటెత్తుతోందని చెప్పారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పిస్తాం

ఆదోని అర్బన్: బాలికల ప్రభుత్వ సాంఘిక, సంక్షేమ వసతిగృహాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. శనివారం స్థానిక విక్టోరియాపేటలోనున్న గుజరాతి పాఠశాలలో ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోనున్న హాస్టళ్లలో విద్యార్థులకు సదుపాయాలు, నాణ్యమైన భోజనం, విద్య, అవసరమైన వర్కర్లను ఏర్పాటు చేస్తామన్నారు. బీసీ బాలికల వసతిగృహంలో 120 మంది బాలికలు ఉంటారన్నారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. వసతి గృహాల మరమ్మతులకు రూ.13.50 లక్షలు, పెద్దకడబూరు మండలంలోని హాస్టల్ కోసం రూ.14 లక్షలు మంజూరయ్యాయని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి వెంకటలక్ష్మి తెలిపారు. ఎంఈఓ శ్రీనివాసులు, ఏఎస్‌డబ్ల్యూ, వార్డెన్లు విశ్వనాథ్‌రెడ్డి, ప్రమీలమ్మ, చలపతి, మాధప్ప, అనిమిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలను చైతన్య పరచండి

గోనెగండ్ల: సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్య పరచాలని వైద్య అధికారులు, సిబ్బందికి మండల ప్రత్యేక అధికారిణి వరలక్ష్మి సూచించారు. శనివారం మండల పరిధిలోని వేముగోడు గ్రామాన్ని ఆమె సందర్శించారు. డ్రైనేజీ, మురుగు కాల్వలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత, పంచాయతీ కార్యదర్శి ఫాతిమా సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓను నియమించండి

కౌతాళం: మండల విద్యాధికారి (ఎంఈఓ-1)ను నియమించాలని ఉపాధ్యాయులు కోరారు. శనివార ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంఈఓ-2 శోభరాణికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎంఈఓ-1 రిటైర్డ్ అయి నెల గడిచినా వారి స్థానంలో ప్రభుత్వం కొత్తగా ఎవరినీ నియమించలేదన్నారు. ఎంఈఓ-1 లేక పోవడంతో పరిపాలన పరంగా ఉపాధ్యాయులకు జీతాలు చేయడానికి సమస్యలు వస్తున్నాయని వెంటనే నియామకం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

నిందితులను శిక్షించాలి

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో మొహర్రం వేడుకల్లో మాల రంగప్ప, ఆయన కుమారుడు మాల నాగరాజు, భార్య మాల నాగమ్మను దూషించి వారిపై దాడులు చేసిన గొల్ల వెంకటేష్, బోయ ఉరుకుందు, కురువ గణేష్, కురువ భీమేష్‌ను వెంటనే చట్ట పరంగా శిక్షించాలని మాలమహానాడు కర్నూలు జిల్లా అధ్యక్షుడు జైబీమ్ సాయిరామ్ డిమాండ్ చేశారు. శనివారం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాల రంగప్పను పరామర్శించారు. బసాపురం యల్లప్ప, దాసరి నరేష్, కుమార్ ఉన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ వీరేష్

కోసిగి: వర్షకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్ కో ఏఈ వీరేష్ సూచించారు. శనివారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో రైతులు, గృహ వినియోగదాలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వర్షకాలంలో జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలు తప్పవన్నారు. రైతులు మోటార్లు, పంప్ సెట్లు ఆన్‌చేసే సమయంలో కాళ్ల కింద తడి లేకుండా , చేతులకు బ్లౌజ్‌లు, కాళ్లకు చెప్పులు ఉపయోగించాలన్నారు. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు పడి ఉంటే అటు వైపు వెళ్లకుండా విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అలాగే గృహ వినియోగదారులు ఇళ్లల్లో స్విచ్ బోర్డులు వద్ద వైరింగ్‌లను చెక్ చేసుకోవాలన్నారు. తడి చేతులతో స్విచ్‌లు ఆన్ చేయడం, ఇతర పనులను చేయకుండా చూసుకోవాలన్నారు.

ఉన్నతాధికారులను కలిసిన ఎమ్మెల్యే




డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ గరికపాటి బిందుమాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

కోసిగి: జిల్లా కేంద్రం కర్నూలులోని డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ గరికపాటి బిందు మాధవ్‌ను మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అధికారులను కలిసి శాలువా, పుష్పగుచ్ఛం రాఘవేంద్ర స్వామి మెమొంటో, పరిమళ ప్రసాదం అందజేశా. వైఎస్సార్‌సీపీ మంత్రాలయం మండల అధ్యక్షుడు భీమా రెడ్డి, వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

పేద విద్యార్థులకు సహకారమందించాలి


విద్యార్థులు, తల్లిదండ్రులతో ఆదర్శమిత్ర మండలి సభ్యులు

ఆదోని సెంట్రల్: పేద విద్యార్థులకు సహకారమందించి వారిని ప్రోత్సహించాలని ఉప విద్యాధికారి వెంకటరమణా రెడ్డి తెలిపారు. ఆదర్శమిత్ర మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పాఠశాలలకు ఫర్నీచర్‌ను శనివారం పంపిణీ చేశారు. సెయింట్ అంథోని పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువుకోవడానికి సరైన ఆర్థిక స్తోమత లేని విద్యార్థులను ఆదుకోవడానికి మిత్రులంతా కలిసి ఆదర్శమిత్ర మండలి పేరుతో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. మండలి ప్రధాన కార్యదర్శి కేశవయ్య, కోశాధికారి శ్రీ వాణి మాట్లాడుతూ ఈ ఏడాది 15 మంది విద్యార్థుల చదువుకయ్యే ఖర్చును భరిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలికల పాఠశాలకు రెండు ప్రింటర్లు, ఆదోని ప్రభుత్వ బాలికల పాఠశాలలోని గ్రంథాలయానికి బీరువాలు, పట్టణంలోని అమరావతి నగర్‌లోనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కుర్చీలు, టేబుళ్లు, బీరువాలు, గ్లాసు అల్మారాలను అందజేశారు. సభ్యులు అనంత ప్రసాద్, రవి ప్రకాశ్ రెడ్డి, బాలాజీ, రాజశేఖర్ రెడ్డి, నరేష్, ఉమాశంకర్, డాక్టర్ సునీల్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి, చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదన్

ఆదోని రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని, పార్టీలకు అతీతంగా కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ బడాయి దానమ్మ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ హాజరై మాట్లాడారు. పాండవగల్ సర్పంచ్ ఉమాదేవి తమ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వర్షపునీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామంలో 5వ తరగతి వరకు మాత్రమే ఉందని, 6వ తరగతి నుంచి కౌతాళం మండలంలోని ఎరిగేరి గ్రామానికి వెళ్లాల్సి రావడంతో తల్లిదండ్రులు పంపలేక విద్యార్థుల చదువులు ఆగిపోతున్నాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. విద్యార్థులకు విద్యను అందించడంలో ఉపాధ్యాయులు పట్టించుకోవడంలేదని సాంబగల్ సర్పంచ్ సువర్ణ తెలిపారు. ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే ఆదోని నియోజకవర్గానికి 700 మంది ఉపాధ్యాయులు వస్తున్నట్లు చెప్పారు.ఇకపై నాసిరకమైన విత్తనాలు, అధిక ధరలకు అమ్మే వ్యాపారస్తులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రులకు రోగులు వెళ్తే అక్కడున్న వైద్యులు ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారని ఎమ్మెల్సీ మధుసూదన్ ప్రభుత్వ డాక్టర్లను నిలదీశారు. ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లలో ఆరోగ్యశ్రీని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి ఘటనలు పునరావృత్తం గాకుండా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్య అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. వారానికొకసారి తాగునీటి విడుదల, నీటి శుద్ధిలో నిర్లక్ష్యంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై మండిపడ్డారు. డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, డీఎల్‌పీవో నూర్జహాన్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయశేఖర్‌రావు, జెడ్పీటీసీ అరుణమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, పంచాయతీ రాజ్ ఏఈ మాలిక్‌బాషా,ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సదుపాయాలు కల్పించండి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నేషనల్ ఒకేషనల్, నర్సింగ్ కళాశాలలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు డి.ఉదయ్ కోరారు. శనివారం కళాశాల అవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నుంచి వేలల్లో ఫీజులు వసులు చేస్తున్నా సదుపాయాలు కల్పించడంలో నేషనల్ ఒకేషనల్ కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ప్రాక్టికల్స్ కోసం కర్నూలుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వసతి గృహంలో ఉంటనే సీటు ఇస్తామని విద్యార్థులకు షరతులు విధించడం దారుణమన్నారు. అధికారులు స్పందించి కళాశాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వినీల్, రాజ్ కుమార్, సూరి అభిషేక్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన


వేముగోడులో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి

గోనెగండ్ల: మండలంలోని వేముగోడు, పుట్టపాశం గ్రామంలోని పంట పొలాలను శనివారం జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత పరిశీలించారు. పత్తి, కంది, వేరుశనగ పంటలను పరిశీలించి రైతులకు సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి పంటలో రసం పీల్చే పురుగుల నివారణకు వేప నూనె 5మీల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. తర్వాత ప్రొఫైనోఫాస్ 2మీల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. వేరుశనగలో ఇనుము దాతు లోపం నివారణకు ఫెరస్ సల్ఫేట్ 10 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలుపుకొని పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. అనంతరం వేముగోడు గ్రామంలో కౌలు రైతులకు కౌలుసాగు హక్కు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ హరి, గ్రామ వ్యవసాయ సహాయకులు షఫీ, మణి, జాకీర్, రైతులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి

ఆదోని రూరల్: మండలంలోని 44 గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొందని, సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా నాయకుడు ఆనంద్‌బాబు, మండల కార్యదర్శి కె.లింగన్న, మండల కమిటీ సభ్యుడు తిక్కప్ప డిమాండ్ చేశారు. శనివారం మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా ఎంపీడీఓ విజయశేఖర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలన్నారు. పెద్దతుంబళం గ్రామానికి ఎస్ఎస్ ట్యాంకు వెడల్పు లేదా అదనపు ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే కుప్పగల్ ఎస్ఎస్ ట్యాంకుకు ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేయాలని, కుప్పగల్ ఎస్ఎస్ ట్యాంకు నుంచి పాండవగల్ గ్రామం వరకు 2వ పైపులైన్ వేయాలని, నౌలేకల్ ఎస్ఎస్ ట్యాంకు నుంచి బసరకోడు వరకు అదనపు పైపులైన్ వేయాలన్నారు. చిన్నహరివాణం ఎస్ఎస్ ట్యాంకు నుంచి సంతెకూడ్లూరు, పెద్దహరివాణం గ్రామాలకు తక్షణమే పైపులైన్ వేసి తాగునీటిని అందించాలన్నారు. నాగేంద్ర, రామాంజనేయులు, ఖాదర్‌బాషా, మునిస్వామి, మూకప్ప పాల్గొన్నారు.